సాక్షి ఏలూరు

గురువారం । 14 । నవంబర్ । 2024



లక్ష లిల్లీ పూలతో అర్చన

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామికి అర్చకులు లక్ష లిల్లీ పూలతో అర్చన నిర్వహించారు.



లేబర్ అధికారుల తనిఖీలు

జంగారెడ్డిగూడెం: అధికారులు జంగారెడ్డిగూడెం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. వలస కార్మికుల పిల్లల పేర్లను అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించారు.



ఎస్పీ ఆకస్మిక తనిఖీ

కొయ్యలగూడెం: సైబర్ నేరాల నిర్మూలనపై దృష్టి సారించాలని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ పేర్కొన్నారు. బుధవారం కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

రోడ్లకు మరమ్మతులు చేయించండి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



కైకలూరు: నియోజకవర్గంలో రహదారులకు మరమ్మతులు చేయాలని శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోరారు. కైకలూరు నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వంతెనలు దెబ్బతిన్న విషయం వాస్తవమైతే వాటి మరమ్మతులకు తీసుకున్న చర్యలు ఏంటని ప్రశ్నించారు. దీనికి రహదారులు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమాధానమిస్తూ గుంతలు లేని రహదారులు ఏర్పాటులో భాగంగా కైకలూరు నియోజకవర్గంలోనూ మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

మనో వికాసానికి క్రీడలు దోహదం



పరేడ్ గ్రౌండ్స్‌లో విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలల మనో వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని, శారీరక వ్యాయామానికి సైతం క్రీడలు ఉపయోగపడతాయని ఎస్పీ కే.ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద పెరేడ్ గ్రౌండ్స్‌లో సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీష్ మీడియం పోలీస్ స్కూల్ విద్యార్థులకు క్రీడా పోటీలను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే చదువుల్లో ముందంజలో ఉంటారని, నిత్యం వ్యాయామానికి సమయాన్ని కేటాయించాలని దాని వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెం, వాలీబాల్, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర క్రీడల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నవంబర్ 14న బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్.సూర్యచంద్ర రావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌టీఏ అధ్యక్షుడిగా స్టీవెన్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): నూతనంగా ఏర్పాటు చేసిన స్కూల్ టీచర్స్ అసోసియేషన్‌కు (ఏపీఎస్‌టీఏ) ఏలూరు జిల్లాకు చెందిన జీజేపీ స్టీవెన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గత మంగళవారం రాజధాని అమరావతిలో బడి -బాధ్యత -భవిష్యత్ నినాదంతో 11 మంది సభ్యులతో నూతన కమిటీ (అడ్‌హక్) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు స్టీవెన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘం ద్వారా ఉపాధ్యాయ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తెప్పోత్సవం.. భక్తకోటి పరవశం



పుష్కరిణి వద్దకు తరలి వెళ్తున్న శ్రీవారు

ద్వారకాతిరుమలలో వేడుక

ద్వారకాతిరుమల: హంసవాహన తెప్పలో ఉభయ దేవేరులతో శ్రీవారు సుదర్శన పుష్కరిణిలో బుధవారం రాత్రి విహరించారు. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ తెప్పోత్సవ వేడుక భక్తులకు కనువిందు చేసింది. విద్యుద్దీప కాంతులు, బాణాసంచా సందళ్లు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణలు, అర్చకులు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ ఉత్సవం భక్తకోటిని పరవశింపజేసింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. తిరువీధి సేవ అనంతరం స్వామివారి వాహనం అట్టహాసంగా సుదర్శన పుష్కరిణి వద్దకు చేరుకోగా, అప్పటికే శోభాయమానంగా అలంకరించిన హంస వాహన తెప్పలో శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకారాలు చేసి, హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, పెన్మత్స నరసింహరాజు పూజాధికాలు నిర్వహించారు. ఆ తరువాత భక్తుల గోవింద నామ స్మరణల నడుమ తెప్ప పుష్కరణిలో విహరించింది.





బాణసంచా కాల్చులు, పుష్కరిణిలో తిరుగాడుతున్న హంస వాహన తెప్ప

రాణిస్తూ.. జాతీయ స్థాయిలో మెరుస్తూ..

- ప్రతిభ చూపుతున్న చిన్నారులు
- ఆసక్తి గల రంగాల్లో ముందుకు..
- తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్న వైనం
- నేడు బాలల దినోత్సవం

నిడమర్రు: నేటి బాలలే రేపటి పౌరులు. వారే భవిష్యత్ నిర్మాతలు. చిన్న నాటి నుంచే చదువులతో పాటు, తమ అభిరుచిగల రంగాల్లో రాణిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని మరికెందరో ఆదర్శంగా నిలుస్తున్న బాలలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంతో మంది ఉన్నారు. వారంతా నేటి బాలలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల్లో, క్రీడల్లో, పోటీ పరీక్షల్లో రాణిస్తోన్న పలువురు విద్యార్థులపై నేడు బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన జల్లికొమ్మర విద్యార్థులు

ఎన్ఎంఎంఎస్‌లో జల్లికొమ్మర విద్యార్థుల రికార్డు

ఎన్ఎంఎంఎస్-2023 పరీక్షల్లో జల్లికొమ్మర యూపీ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కవల రిషిత, మద్దాల శరణ్ సంధ్య, బోడపాటి హరిత రమ్య, మద్దాల దివ్యజ్యోతి, నిమ్మా బాలాజీలు జనరల్ కేటగిరిలోనూ, తిరువోలు శ్రీహరి రిజర్వేషన్ కేటగిరిలో ఎంపికయ్యారు. జిల్లాలో 137 మంది ఉపకారవేతనానికి ఎంపికవ్వగా వీరిలో 30 మంది మాత్రమే జనరల్ అభ్యర్థులు. వీరిలో యూపీ స్కూల్ నుంచి ఐదుగురు టాప్ 60 జాబితాలో ఉన్నారు. బ్యాంకింగ్ రంగాల్లో రాణించడమే తమ లక్ష్యమని వారు చెబుతున్నారు. వీరిని పూర్వపు డీఈఓ ఎస్ అబ్రహాం అభినందించారు.

శ్రీగుణశ్రీకర్ బ్యాట్ పడితే పతకాలే

చేబ్రోలుకు చెందిన యువ క్రీడాకారుడు ఆదిరెడ్డి శ్రీగుణ శ్రీకర్ జాతీయ స్థాయిలో జరిగే షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్, డబుల్‌కు ఎంపికయ్యాడు. 2023లో తిరుపతిలో, 2024లో వైజాగ్‌లో జరిగిన ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వరుసగా ప్రథమస్థానంలో నిలిచి రెండు సార్లు రూ.1 లక్ష చొప్పున నగదు బహుతి గెలుచుకున్నాడు. ప్రస్తుతం కాకినాడలో డిగ్రీ చదువుతున్న శ్రీగుణ శ్రీకర్ పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు పలు పతకాలు సాధించాడు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా స్ఫూర్తి పెంచారని శ్రీగుణ శ్రీకర్ తెలిపారు. తాత ఆదిరెడ్డి సత్యనారాయణ ప్రోత్సాహంతోనే జాతీయ పోటీల్లో రాణించి అంతర్జాతీయ పోటీల్లో భారత్ తరుపున ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని గుణశ్రీకర్ పేర్కొన్నారు.



మంత్రి రోజా చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న శ్రీగుణశ్రీకర్(ఫైల్)

కరాటేలో కవలల ప్రావీణ్యం

నిడమర్రు మండలం చానమిల్లి గ్రామానికి చెందిన బేతు లక్ష్మీ సాయి పవన్ తేజ, లక్ష్మీ ఆర్య చైతన్య తేజలు కవలలు. వీరు చదువుతోపాటు కరాటేలోనూ ప్రావీణ్యం చూపుతున్నారు. ఈ ఏడాది జులై 22న చెన్నైలో జరిగిన చాలెంజర్స్ కప్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో రెండేసి బంగారు పతకాలు సాధించారు. కతా (సోలో), కుమిటి (ఫైటింగ్) పోటీల్లో ఇతర దేశాల చిన్నారులతో పోటీపడి ప్రథమ స్థానాల్లో నిలిచారు. తండ్రి దుర్గా సూర్య ప్రకాష్ కరాటే కోచ్ అవ్వడంతో కరాటేపై మక్కువ పెంచుకున్నారు. 2022లో పదేళ్ల వయసులోనే గుంటూరులో జరిగిన నేషనల్ కరాటే పోటీల్లో రెండేసి స్వర్ణాలు సాధించారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం, ఒలింపిక్‌లో భారత్ తరుపున ఆడడమే తమ లక్ష్యమని వారు చెబుతున్నారు.



గోల్డ్ మెడల్‌తో బేతు లక్ష్మీ సాయి పవన్ తేజ



గోల్డ్ మెడల్‌తో బేతు లక్ష్మీ ఆర్య చైతన్య

ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో అజయ్‌రాజు



ప్రాజెక్ట్ ప్రదర్శిస్తున్న అజయ్ రాజు, గైడ్ టీచర్ జాన్ (ఫైల్)

తక్కువ ఖర్చుతో గూడ్స్ రవాణాపై కైకరం జెడ్పీ స్కూల్ విద్యార్థి హనుమంతు అజయ్‌రాజు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్‌ను 2022లో ఏపీ తరుపున ఢిల్లీలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించారు. అజయ్‌రాజు తండ్రి రంగారావు ఆటో డ్రైవర్. తల్లి గృహిణి. ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో స్టేట్ ఫస్ట్ రావడంతో విట్ అమరావతిలో బీటెక్ ఫ్రీసీట్ సాధించిన అజయ్‌రాజు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడమే లక్ష్యమని చెబుతున్నారు.

జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో కుసుమలత



కుసుమలత

డిసెంబర్‌లో ఛత్తీస్ ఘడ్‌లో జరిగే జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో వైజ్ఞానిక ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఉంగుటూరు మండలం కైకరం జెడ్పీ స్కూల్ విద్యార్థిని నెరుసు కుసుమలత ప్రాతినిధ్యం వహించనుంది. ఆమె ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో తాడి చెట్టు పెంపకంలో నూతన విధానంపై తయారు చేసిన ప్రాజెక్ట్ ప్రదర్శించి ప్రతిష్టాత్మక కేవీఆర్ సైంటిఫిక్ ఫౌండేషన్ అవార్డు అందుకుంది. గతేడాది రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శనలో ఈకో ఫ్రెండ్లీ నర్సరీ ప్రాజెక్ట్‌కు ప్రథమస్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. సైంటిస్ట్‌గా దేశానికి సేవే చేయడమే తన లక్ష్యమని చెబుతోంది. ఆమె తండ్రి శ్రీనివాసు వ్యవసాయ కూలీ. తల్లి లక్ష్మి గృహిణి.

రన్నింగ్‌లో సాహిల్‌కు నేషనల్ గోల్డ్



సాహిల్‌బాబు

ఏలూరుకి చెందిన కైలా సాహిల్‌బాబు కోయంబత్తూరులో ఈ ఏడాది జరిగిన 38వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు నుంచి పాల్గొని 80 మీటర్ల హార్డిల్స్ రన్నింగ్‌లో స్వర్ణ పతకం సాధించాడు. 2023 వరంగల్‌లో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్ పోటీల్లో 100 మీటర్ల ఈవెంట్‌లో సౌత్ ఇండియా రికార్డు సాధించాడు. 100, 80 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించాడు. గుంటూరులో 2022లో సౌత్‌జోన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో రజతం, అదే ఏడాది ఏలూరులో జరిగిన ఏపీ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో 100, 80 మీటర్ల హార్డిల్స్ ఈవెంట్‌లో బంగారు పతకాలతోపాటు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ క్రీడాకారుడు అవార్డు అందుకున్నాడు. సాహిల్‌బాబుకు సీఎస్ఆర్ నిధుల నుంచి నాటి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రూ.2 లక్షల ప్రోత్సాహం అందిచారు. ఒలింపిక్స్‌లో భారత్ తరుపున ప్రాతినిధ్యం వహించాలనేదే తన లక్ష్యమని సాహిల్‌బాబు తెలిపారు.

హెల్మెట్ విక్రయం తప్పనిసరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్విచక్ర వాహనాన్ని విక్రయించే సమయంలోనే తప్పనిసరిగా హెల్మెట్‌ను కొనుగోలుదారుడికి విక్రయించాలని జిల్లా ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ వాహన డీలర్లను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ద్విచక్ర వాహన డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రామాణికత కలిగిన బీఐఎస్ హెల్మెట్లను మాత్రమే విక్రయించాలని, వాహనాన్ని విక్రయించే సమయంలోనే హెల్మెట్ ఉపయోగం, డ్రైవింగ్ లైసెన్స్ ఉండటం వల్ల ప్రయోజనాలపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనంతో పాటు హెల్మెట్‌ను విక్రయించలేదని తమ దృష్టికి వస్తే సంబంధిత డీలరుపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ ఉపయోగించడం ద్వారానే ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు.

పుష్కలంగా విత్తనాల నిల్వలు

ఏలూరు(మెట్రో): ఉభయ గోదావరి జిల్లాల రైతులకు అవసరం మేరకు అపరాలు, వరి విత్తనాల నిలువలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా తెలిపారు. ఇప్పటికే కలిదిండి, మండవల్లి, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో అపరాలు విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. మండల వ్యవసాయాధికారుల నుంచి వచ్చిన ప్రణాళిక ఆధారంగా ఏపీ సీడ్స్ ప్రధాన విత్తన గోడౌన్ నుంచి నేరుగా రైతు సేవా కేంద్రాల్లో నిర్దేశించిన గడువు లోగా విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచాలి

ఏలూరు (టూటౌన్): బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు జరిగే బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ప్రధానంగా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఎవరైనా సామాన్య వ్యక్తులు, ప్రభుత్వాధికారులు లేదా వ్యవస్థలు బాలల హక్కులు ఉల్లంఘించిన సందర్భంలో నేరుగా ఆ కేసులను స్వీకరించి సుమోటోగా నోటీసులు జారీ చేసి విచారణ చేయించే అధికారం ఉందన్నారు. బాల బాలికల రక్షణ సంరక్షణ కోసం ప్రభుత్వానికి సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో, సలహాలు ఇచ్చే అధికారం ఉందన్నారు.

విభిన్న ప్రతిభావంతుల్ని ఆదుకునేందుకు ప్రాధాన్యం

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): విభిన్న ప్రతిభావంతుల్ని ఆదుకోవడంలో అధిక ప్రాధాన్యతనిస్తామని కలెక్టర్ కె. వెట్రిసెల్వి భరోసా ఇచ్చారు. కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా ప్రతి శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి నెల నాలుగో శనివారం ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో సంబంధిత అసోషియేషన్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో డిసెంబరులో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం, జనవరి 4న లూయీ బ్రెయిలీ జన్మదినం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. జెడ్పీ, మున్సిపల్ తదితర షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో దివ్యాంగుల షాపులు ఏర్పాటుకు తగు ప్రాధాన్యత నివ్వాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రామ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జెడ్పీ సీఈవో కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

కైకలూరు: ద్విచక్ర వాహనాల దొంగను కైకలూరు టౌన్ పోలీసులు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద బుధవారం అరెస్టు చేశారు. టౌన్ సీఐ పి.కృష్ణ మాట్లాడుతూ ఏలూరుకు చెందిన కడవకొల్లు మణికంఠ (25) వాహనాలు దొంగిలించగమే వృత్తిగా జీవిస్తున్నాడన్నారు. ఇతడిపై విజయవాడ ప్రాంతంలో 10 కేసులు ఉన్నాయని, కైకలూరులో రెండు వాహనాలు దొంగతనం కేసులలో ముద్దాయిగా ఉన్నట్టు చెప్పారు. రైల్వే స్టేషన్ వద్ద టౌన్ ఎస్సై డి.వెంకట్‌కుమార్ తనిఖీలు చేస్తుండగా దొంగ పట్టుబడ్డాని, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై ఉక్కుపాదం

కన్వీనర్లు, కో–కన్వీనర్ల అరెస్ట్

కొయ్యలగూడెం/ఆకివీడు : రెడ్‌బుక్ రాజ్యాంగంతో రక్త చరిత్రను లిఖిస్తున్న కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఏలూరు జిల్లా కన్వీనర్‌పై పోలీస్ కేసు నమోదు చేసింది. తనపై వివిధ సెక్షన్లను ప్రయోగించి కేసు నమోదు చేసినట్టు చిక్కాల దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టారని పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో–కన్వీనర్ల ఇద్దరిని భీమవరం పట్టణ పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఉండి మండలం పెదపుల్లేరుకి చెందిన పాటూరి దొరబాబు, ఆకివీడు మండలం అయిభీమవరం గ్రామానికి చెందిన కమతం మహేష్‌లను 41ఏ కింద నోటీసులు జారీ చేసి అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ బెయిల్‌పై వీరిని విడుదల చేశారు.

గుంటూరులో అరెస్ట్ చేసి..

నూజివీడు: గుంటూరులో అరెస్టు చేసిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ పి.రాజశేఖర్ రెడ్డిని నూజివీడు రూరల్‌పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. 2023 జులై 15న వంగలపూడి అనితపై అనుచితమైన పోస్టులు పెట్టాడని, దీనిపై నూజివీడు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు ఈనెల 9న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. బుధవారం అరెస్టు చేశామని ఈనెల 14న కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.